క్లుప్తంగా

నైపుణ్యాభివృద్ధికి ఏసీసీఐ దోహదం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సివిల్ ఇంజినీర్ల నైపుణ్యాభివృద్ధికి ఏసీసీఐ (అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్) దోహదపడుతుందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఏసీసీఐ మూడో వార్షికోత్సవాన్ని శనివారం నగరంలోని ఓ హోటల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ సంస్థ ద్వారా సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు సెమినార్లు, వర్క్‌షాపులు, సాంకేతిక చర్చలు వంటివి నిర్వహిస్తున్నామన్నారు. సంస్థ ప్రారంభించిన మూడేళ్లలో జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం సంతోషకరమన్నారు. కాకినాడ చాప్టర్ చైర్మన్ బాదం సుందరరావు, వైస్ ప్రెసిడెంట్ సూర్యప్రకాశరావులు ఈ–చాప్టర్ ద్వారా చేపట్టిన కార్యక్రమాలు వివరించారు. చాప్టర్ కార్యదర్శి దుర్గాప్రసాద్, సివిల్ ప్రొఫెసర్ రవీంద్రతోపాటు నగరంలో ప్రముఖ బిల్డర్లు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు సాయం



దివ్యాంగులకు కృత్రిమ కాలిని అందజేస్తున్న ఆర్డీఓ సత్యనారాయణ

కాకినాడ రూరల్: వాకలపూడిలోని ఉమా మనోవికాస కేంద్రంలో మానవత్వ దినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, ట్రై సైకిళ్లను ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. అపెక్స్ ప్రాజెన్ ఫుడ్స్ లిమిటెడ్ సహకారంతో 30 మందికి కృత్రిమ అవయవాలు, వినికిడి యంత్రాలు, ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు సహాయం అందించడం అభినందనీయమన్నారు. ఉమా మనోవికాస కేంద్రం ప్రాజెక్టు డైరెక్టర్ కె.నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బాబ్జీ, పార్థసారథి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల పంపిణీ

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో దీర్ఘకాలిక రోగులకు శనివారం కోడిగుడ్లు పంపిణీ చేశారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ మాట్లాడుతూ దీర్ఘకాలిక రోగులకు బలమైన పోషకాహారం అందించేందుకు ప్రతి నెలా గుడ్లను లయన్స్ క్లబ్ ప్రొఫెషనల్ తరఫున ద్వారంపూడి విపుల్‌రెడ్డి అందిస్తున్నారన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా, డాక్టరు శిరీష తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు గద్దర్ చిరస్మరణీయుడు



కరపలో గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంఘ నాయకులు

కరప: తన పాటలతో ప్రజలను చైతన్యపరిచిన ప్రజా గాయకుడు గద్దర్ చిరస్మరణీయుడని మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం గద్దర్ మృతికి సంతాప సభ నిర్వహించారు. మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం నాయకులు రొక్కాల గణేష్, మాతా అప్పారావు, మార్నెళ్ల వెంకటరమణ, సాదే లోహిదాస్, వజ్రపు కామేశ్వరరావు, శుభామహేష్, ఎస్.రాజేష్, ఆర్.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఓ కార్యాలయ ఏఓ మృతి



రాజు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): కాకినాడ రవాణా శాఖ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న జీవీవీకేజే రాజు (52) శనివారం ఉదయం గుండె పోటుతో మృతిచెందారు. రామచంద్రపురానికి చెందిన ఆయన జిల్లాలో మండపేట, అమలాపురం తదితర ఆర్టీఓ కార్యాలయాల్లో వివిధ హోదాల్లో పనిచేసి ప్రస్తుతం కాకినాడ కార్యాలయంలో 2019 నుంచి విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా రవాణా శాఖాధికారి మోహన్, ఎంవీఐ, ఏఎంవీఐ, కార్యాలయ సిబ్బంది నివాళులర్పించారు.

ఆర్బీకేలు... సమస్త సేవలు

- రైతులకు ఎంతో మేలు
- టీడీపీ హయాంలో అన్నీ కష్టాలే
- వైఎస్సార్ సీపీతో సంక్షేమ పరవళ్లు



రైతు భరోసా కేంద్రం

కాకినాడ సిటీ: గత టీడీపీ ప్రభుత్వంలో సాగు దండగలా మారింది.. అప్పట్లో విత్తనాలు, రసాయన ఎరువులు, ఇన్‌పుట్ రాయితీల కోసం మండల కేంద్రాలకు రైతులు పరుగులు తియ్యాల్సి వచ్చేది. అయినా వ్యయ ప్రయాసలు తప్ప ఆశించిన ప్రయోజనం ఉండేది కాదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పుడమి పుత్రుల కష్టాలన్నీ తీరాయి. గ్రామ స్థాయిలోనే వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన సేవలన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారా అందుతున్నాయి. తద్వారా వ్యవసాయం పండుగలా మారింది.. ఆర్బీకేల ఏర్పాటుతో పాటు వైఎస్సార్ యంత్ర సాయం, సాగు రుణాలు, రైతుల భరోసా వంటి పథకాలు అందుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దూరదృష్టితో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాలు సత్ఫలితాలు ఇస్తున్నాయి. కరప మండలంలో సాగు విస్తీర్ణం 14,300 ఎకరాలు కాగా చిన్న, సన్నకారు రైతులు 15,900 మంది ఉన్నారు. వీరి కోసం మొత్తం 21 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్‌లో సాగు విస్తీర్ణం 4,500 ఎకరాలు కాగా సన్న, చిన్నకారు రైతులు 5,600 మంది ఉన్నారు. మొత్తం 16 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని రైతుభరోసా కేంద్రాల్లో రైతుల కోసం 2,690 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచారు. ఈ ఆర్బీకేల్లో వ్యవసాయ శాఖలకు సంబంధించిన సేవలే కాకుండా ఉద్యాన శాఖ, ఏపీఎంఐపీ, పశు సంవర్ధక, మత్స్య, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ శాఖల సేవలన్నీ గ్రామ స్థాయిలోనే అందుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విత్తు నుంచి విక్రయం వరకూ..

వ్యవసాయంలో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి ఉత్పాదకతను పెంచడం, ఇందుకు అవసరమైన అన్ని రకాల ఇన్‌పుట్స్ అంటే విత్తనం నుంచి పంట విక్రయాల వరకూ ఆర్బీకేలు రైతులకు అండగా నిలుస్తున్నాయి. ఆర్బీకేల్లో వ్యవసాయ విజ్ఞానానికి సంబంధించి సుమారు 50 పుస్తకాలతో మినీ లైబ్రరీలు సైతం ఏర్పాటు చేశారు. అలాగే పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. ఘన, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ తదితర వాటిపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. డిజిటల్ కియోస్కుల ద్వారా అవసరమైన వాటిని ఆర్డర్ పెడితే ఇంటికే చేరుతున్నారు. గతంలో ప్రైవేట్ డీలర్లు రసాయన ఎరువులను అడ్డగోలుగా అధిక ధరలకు విక్రయించేవారు. ఆర్బీకేలు ఏర్పాటైన తరువాత వీరి అక్రమాలకు చెక్ పడింది. వ్యవసాయ సీజన్లో ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నారు. పంటల సాగులో చేపట్టాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ఆర్బీకేల వారీగా పొలంబడి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అందుబాటులో అన్ని సేవలు



గ్రామంలోనే ఆర్బీకేల ద్వారా అన్ని సేవలందుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు పొందుతున్నాం. ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతున్నారు. వ్యవసాయ సిబ్బంది పంట పొలంలోకి వచ్చి ఈ–క్రాప్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో ఎరువులు, విత్తనాల కోసం మండల కేంద్రానికి వెళ్లి క్యూలో నిలబడాల్సి వచ్చేది. ఇప్పుడా పరిస్థితి లేదు.

– రావుల ప్రసాద్, రైతు, కూరాడ, కరప మండలం

రాయితీపై విత్తనాలు



వ్యవసాయ, అనుబంధ శాఖలకు సంబంధించిన సేవలు ఆర్బీకేల ద్వారా రైతుల ముంగిట్లోకే అందించే ఏర్పాటు చేశాం. రాయితీలతో విత్తనాలు కూడా అందిస్తున్నాం. కస్టం హైరింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఆధునిక యంత్ర పరికరాలను అందుబాటులోకి తెచ్చాం.

– ఎస్.విజయకుమార్, జాయింట్ డైరెక్టర్, వ్యవసాయశాఖ, కాకినాడ జిల్లా

సమగ్ర అభివృద్ధికి కార్యాచరణ



ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్‌పై పరిశీలిస్తున్న కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా ప్రతి సచివాలయ పరిధిని యూనిట్‌గా తీసుకుని ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. శనివారం ఆయన స్థానిక టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన వివిధ అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల జారీ, రహదారులు, డ్రైనేజీల నిర్మాణం కోసం అవసరమైన చోట్ల టీడీఆర్ బాండ్ల మంజూరుకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా పావురాల తూము ప్రాంతాన్ని సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా ఉన్న స్థలాలకు మాత్రమే టీడీఆర్ బాండ్లను జారీ చేస్తామని అన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రహదారులు, డ్రైనేజీల నిర్మాణాన్ని క్రమ పద్ధతిలో నిర్వహించేందుకు ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగశాస్త్రులు పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

- కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి
- 11 వేల పండ్ల మొక్కలు నాటేందుకు శ్రీకారం



మొక్క నాటుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా అన్నారు. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కాకినాడ పాస్టర్స్ ఫెలోషిప్ పర్యవేక్షణలో స్థానిక బాలాజీచెరువు సెంటర్‌లోని క్రేగ్ మెమోరియల్ చర్చిలో శనివారం పండ్ల మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ కృత్తికా శుక్లా, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ కాకినాడ సుందరీకరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నగరంలోని 450 చర్చిలు, విద్యా సంస్థల్లో పండ్ల మొక్కలను నాటడం వల్ల పౌష్టికాహారం కూడా లభిస్తుందన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నగరపాలక సంస్థ తోడ్పాటుతో రూ.10 లక్షల విలువైన పండ్ల మొక్కలను నగరంలోని చర్చిలు, ప్రభుత్వ పాఠశాలల కోసం సమకూరుస్తున్నామన్నారు. ఇచ్చిన ప్రతి మొక్కను సంరక్షించుకోవాలని సూచించారు. చెట్లను పెంచడం ఎంతో శ్రమతో కూడుకున్న అంశమని, ఈ విషయంలో ముందుకు వచ్చి పండ్ల మొక్కల పెంపకాన్ని ఒక ఉద్యమంలో చేపట్టిన ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ప్రశంసించారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో నాటే మొక్కల ద్వారా వచ్చే పండ్లను అక్కడి విద్యార్థులే వినియోగించుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రికీ గూటం, కార్యదర్శి స్టీఫెన్ ఆనంద్ మాట్లాడుతూ బొప్పాయి, సపోటా, ఉసిరి, మామిడి, జామ వంటి 12 రకాల మొక్కలను చర్చిలలో నాటుతున్నామన్నారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్ తదితరులు హాజరయ్యారు.

బ్యాడ్మింటన్ క్రీడాకారులకు చేయూత



క్రీడాకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్న వీరభద్రారెడ్డి తదితరులు

నాగమల్లితోట జంక్షన్: వరల్డ్ సీనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు కాకినాడకు చెందిన పలువురు చేయూత అందించారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకూ సౌత్‌కొరియాలోని జియోంజులో జరిగే బ్యాడ్మింటన్ పోటీలకు కాకినాడకు చెందిన శ్రీవెంకట్ జగన్నాథ్, దాసరి సునీల్ ఎంపికయ్యారు. వీరికి ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ద్వారంపూడి వీరభద్రారెడ్డి రూ.30 వేలు, ఆఫీసర్స్ క్లబ్ ప్లేయర్లు రూ.20 వేలు అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రారెడ్డి మాట్లాడుతూ 62 దేశాల నుంచి క్రీడాకారులు ఈ పోటీలకు హాజరవుతున్నారని, జిల్లా నుంచి జగన్నాథ్, సునీల్ పాల్గొనడం గర్వకారణమన్నారు. క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించేందుకు మరింత మంది ముందుకు రావాలని కోరారు. ఆఫీసర్స్ క్లబ్ క్రీడాకారులు రామకృష్ణ, గణేష్, రమణ, రమేష్, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

'మెడికవర్'లో అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స గురించి వివరిస్తున్న డాక్టర్ మాతా శ్రీనివాస్, చిత్రంలో కుడివైపు చివర ప్రభాకరం

కాకినాడ రూరల్: ఉభయగోదావరి జిల్లాల్లో తొలిసారిగా మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స చేశామని వైద్యులు తెలిపారు. ఆ వివరాల్లోకి వెళ్తే.. అమలాపురానికి చెందిన కొప్పర్తి ప్రభాకరం (71) గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్నాడు. సాధారణంగా నిమిషానికి 70 సార్లు కొట్టుకునే హార్ట్ బీట్ 30 సార్లకు తగ్గిపోయింది. కుటుంబ సభ్యులు ఆయన్ని అచ్చంపేట జంక్షన్‌లోని మెడికవర్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. కార్డియాలజీ విభాగంలోని వైద్య నిపుణుడు మాతా శ్రీనివాస్, డాక్టర్లు ప్రణవ్, నరేష్ బృందం ప్రభాకరాన్ని పరీక్షించి శస్త్రచికిత్స ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. దీనికి రూ.12 లక్షల వరకూ అయ్యే అవకాశం ఉందని తెలుసుకుని రోగి ప్రభాకరం కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ నెల 16న ప్రభాకరం గుండెలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచంలోనే అతి చిన్న లీడ్‌లెస్ పేస్ మేకర్ ఇంప్లాంటేషన్– మైక్రా ఏవీని అమర్చి శస్త్రచికిత్స విజయవంతం చేశారు. ఈ విషయాన్ని శనివారం మెడికవర్ ఆస్పత్రిలో ఏర్పాటైన మీడియా సమావేశంలో ఆస్పత్రి యూనిట్ హెడ్ సిద్దారెడ్డి తెలిపారు. శస్త్రచికిత్స ద్వారా రోగి గుండెలో అమర్చిన లీడ్‌లెస్ పేస్ మేకర్ ద్వారా హార్ట్ బీట్ పల్స్ రేటును 70కు సరిచేశామన్నారు. ఉభయ గోదావరి జిల్లాలు, గుంటూరు జిల్లాలో ఇలాంటి శస్త్రచికిత్స చేయడం ఇదే ప్రథమమన్నారు.

చిత్రం.. జ్ఞాపకాలు పదిలం

- ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



కరపలో దాగూరే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు



రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లకు సన్మానం

కాకినాడ రూరల్: చిత్రాలే జ్ఞాపకాలను పదిలం చేస్తాయని కాకినాడ, పరిసర ప్రాంతాల్లో ఫొటోగ్రాఫర్లు పాటి నాగేశ్వరరావు, సీహెచ్ నరేష్, కోడూరి కుమారస్వామి అన్నారు. శనివారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫొటోగ్రాఫర్లు నాగేశ్వరరావు, నరేష్, కుమారస్వామిలను అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, రెడ్నం రాజా, కృష్ణ, రాఘవరావు, చంద్రరావు, సత్యనారాయణ చౌదరి తదితరులు సత్కరించారు. అనంతరం సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది 1839 నాటిదని, లూయిస్ డాగూరేచే అభివృద్ధి చెందిందన్నారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలో అరుదైన, అందమైన దృశ్యాలను కెమేరాలో బంధించడం వల్ల అవి శాశ్వతంగా నిలుస్తాయన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ

కాకినాడ సిటీ: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని తూరంగి అయ్యప్పస్వామి గుడి శెట్టిబలిజపేటలో ఉన్న జనావళి వృద్ధాశ్రమంలో నిర్వహించారు. తూరంగి డ్రైవర్స్ కాలనీకి చెందిన సంఘ సేవకుడు, ఫొటోగ్రాఫర్ గూడూరు అప్పారావు చేతుల మీదుగా వృద్ధులకు, వికలాంగులకు స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ వృద్ధుల పట్ల ప్రేమగుణం కలిగి ఉండాలన్నారు.

కరప మండలంలో..

కరప: స్థానికంగా శనివారం మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. కెమేరాను కనుగొన్న లూయిస్ దాగూరే చిత్రపటానికి అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తెమ్మన బోయిన వీరభద్రరావు మాట్లాడుతూ లూయిస్ డాగూరే కెమేరాను కనుగొనడంతోనే ఎందరికో జీవనోపాధి లభించిందన్నారు. అసోసియేషన్ కార్యదర్శి మల్లిపూడి బాబులు, కోశాధికారి కె.వెంకన్నబాబు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

హరి సేవలు చిరస్మరణీయం



బందన హరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ఏపీ అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మత్స్యకార నాయకుడు బందన హరి సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. అనారోగ్యంతో హరి మరణించగా శనివారం జగన్నాథపురంలోని ఆయన కుటుంబ సభ్యులను మంత్రి అప్పలరాజు, ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. బందనహరి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ పార్టీ అభ్యున్నతి కోసం హరి ఎనలేని సేవలందించారని కొనియాడారు. ఎంపీ గీత మాట్లాడుతూ రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుని ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ బందన హరి రాజకీయాల్లో మంచి పేరు తెచ్చుకున్నారని, ఆయన సమర్థతను చూసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారన్నారు. కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్, చోడిపల్లి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ సిరియాల చంద్రరావు, ట్రేడ్ యూనియన్ నాయకులు సీహెచ్ లక్ష్మీనారాయణ తదితరులు పరామర్శించారు.

సీఎం జగన్‌ను మళ్లీ ఆశీర్వదించండి

- గడప గడపలో ఎమ్మెల్యే ద్వారంపూడి



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి

కాకినాడ: ప్రజా సంక్షేమానికి అహర్నిశలూ శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక 29వ డివిజన్ రంగయ్య నాయుడు వీధి, జ్యోతుల మార్కెట్, సాయిబాబా ఆలయం, జొన్నాడ వారి వీధి, మందపాటివారి వీధి ప్రాంతాల్లో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి చిత్తశుద్ధి చాటుకున్న సీఎంకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. ఇటువంటి ముఖ్యమంత్రి అధికారంలో కొనసాగితే ప్రజలకు అన్ని విధాలా మేలు జరుగుతుందని వివరించారు. కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, నాయకులు వాసిరెడ్డి రాంబాబు, యాళ్ల పట్టాభి, తోకల గోపి, లోవబాబు పాల్గొన్నారు.

నిషేధాన్ని ఎత్తివేయాలి

కాకినాడ సిటీ: రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక ఆందోళనలపై పోలీసుల నిర్బంధాన్ని ఆపాలని, కలెక్టరేట్ వద్ద ధర్నాలపై విధించిన అనధికార నిషేధాన్ని ఎత్తివేయాలని కోరుతూ కాకినాడ జిల్లా అఖిలపక్ష సంఘాల నాయకులు శనివారం రాత్రి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. అఖిలపక్షం నాయకులు దువ్వా శేషుబాబ్జీ, జి.బేబీరాణి, దూసర్లపూడి రమణరాజు, తులసి, చంద్రమళ్ల పద్మ, చెక్కల రాజ్‌కుమార్, తాళ్లూరి రాజు, మేడిశెట్టి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు అండర్–15 చెస్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ జిల్లా చెస్ సంఘం, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి అండర్–15 చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధి మనోహర్ శనివారం తెలిపారు. స్థానిక ఆంధ్రాబ్యాంక్ కాలనీలోని సమంత హైట్స్‌లో పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. కాకినాడకు చెందిన క్రీడాకారులు మాత్రమే అర్హులన్నారు. ఆసక్తి గల వారు సంబంధిత అర్హత పత్రాలతో హాజరుకావాలని, రిజిస్ట్రేషన్‌కు రూ.300 చెల్లించాలని ఆయన కోరారు.

'నవరస' బ్రోచర్ విడుదల



నవరస వార్షికోత్సవ బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ప్రసాద్‌రెడ్డి తదితరులు

కాకినాడ కల్చరల్: స్థానిక దంటు కళాక్షేత్రంలో 27న నవరస నాటక పరిషత్ 59వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని పరిషత్ అధ్యక్షుడు గరికపర్తి నమఃశ్శివాయ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శాస్త్రి కళాపీఠంలో శనివారం వేడుకలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఉదయం 8 నుంచి రాత్రి 9 గంటల వరకూ వేడుకలు నిర్వహిస్తామని గరికపర్తి తెలిపారు. ముందుగా సాంస్కృతిక కార్యక్రమాలు తదుపరి నాటికలు ప్రదర్శిస్తామన్నారు. ఎస్ఎస్ఆర్‌కే గురు ప్రసాద్ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రముఖ కళాకారులు తరాల గాలీబుకు ప్రదానం చేస్తామని పరిషత్ కార్యదర్శి బి.గోపాల్ తెలిపారు. సినీ నిర్మాత ప్రసాద్‌రెడ్డి, పరిషత్ ఉపాధ్యక్షుడు మార్ని జానకీరామ్ చౌదరి, సీఎన్ మూర్తి, బుర్రా పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.